ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

గురువారం 12 డిసెంబరు 2024



చిన్నదాసరిపల్లె రెవెన్యూ పొలంలో ఆగిపోయిన జీఎన్ఎస్ఎస్ కాల్వ పనులు

గాలేరు నగరి సుజలస్రవంతి (జీఎన్ఎస్ఎస్) కాల్వ పనులు దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. పనులపై నిర్లక్ష్యం, భూసేకరణ జరగకపోవడం, ఫారెస్టు అనుమతుల్లో జాప్యం, పాలకుల వైఫల్యం.. వెరసి కాల్వ పనుల పురోగతి నత్తనడకతో పోటీగా ముందుకు సాగుతోంది. గత ప్రభుత్వంలో వేసిన టెండర్లను జగన్ ప్రభుత్వం రద్దు చేసి రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా మళ్లీ టెండర్లు పిలిచింది. పీఎల్ఆర్, ఎంఆర్కేఆర్ కంపెనీలు సొంతం చేసుకుని పనులు మొదలుపెట్టాయి. బిల్లులు రాకపోవంతో వీరూ పనులు ఆపేశారు.

కాల్వ పనులు అంతేనా..?

- దశాబ్దాలు గడుస్తున్నా..
- ముందుకు సాగని జీఎన్ఎస్ఎస్ కాల్వ పనులు
- రైతులకు సాగునీరు ఎదురుచూపులతోనే సరి

పెండ్లిమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం ఉమ్మడి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.60లక్షల ఎకరాలకు సాగునీరు 640 గ్రామాలకు తాగునీరు అందించడం. శ్రీశైలం జలాశయం ఎగువ నుంచి 38 టీఎంసీలు కృష్ణా వరద జలాలు తీసుకుని రావడానికి వీలుగా 2004-05లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ప్రధాన కాల్వ రిజర్వాయర్ల నిర్మాణాలకు రూ.2,189కోట్ల నిధులు మంజూరు చేస్తూ 2005 అక్టోబరు 15న పరిపాలన అనుమతులు ఇచ్చారు. 14 ప్యాకేజీలకు టెండర్ల ద్వారా 2006లో కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. రూ.946.82కోట్లతో ప్యాకేజీ ఒకటి నుంచి ఏడు వరకు కడప జిల్లాలో తెలుగుగంగ ప్రాజెక్టు సీఈ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. అటవీ శాఖ అనుమతుల జాప్యం, కాంట్రాక్టర్ల బాధ్యతారాహిత్యం, పాలకులలో చిత్తశుద్ధి లోపించడంతో ఈ ప్రాజెక్టు పనుల పురోగతి 25శాతం కూడా దాటలేదు. నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది తప్ప ఈ ప్రాంత రైతుల సాగునీటి కల నెరవేరలేదు.

త్వరలోనే పనులు మొదలవుతాయి..

గాలేరు నగరి సుజల స్రవంతి పనులు త్వరలోనే మొదలవుతాయి. ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఈ ప్రాజెక్టుపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- హుస్సేన్‌రెడ్డి, డీఈ జీఎన్ఎస్ఎస్

తిరోగమనంలో పురోగతి

వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక టీడీపీ ప్రభుత్వంలో వేసిన టెండర్లను రద్దు చేసింది. రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా 2019 డిసెంబర్‌లో టెండర్లు నిర్వహించారు. ఈ ప్రాజెక్టులో 32 కిలోమీటర్ల నుంచి 66కిలోమీటర్ల వరకు ప్రధాన కాల్వ నిర్మాణ పనులను ప్యాకేజీ ఒకటి కంద రూ.391.14కోట్లతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ దక్కించుకుంది. 66వ కిలోమీటర్ నుంచి 96 కిలోమీటర్ వరకు ప్యాకేజీ-2 కింద రూ.349.97కోట్లతో రాజంపేట మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబానికి చెందిన ఎంఆర్కేఆర్ నిర్మాణ సంస్థ దక్కించుకుంది. ఈ రెండు కంపెనీలు ఇరిగేషన్ శాఖతో ఒప్పందం చేసుకుని 2020 జూలై నెలలో పనులు మొదలుపెట్టారు. జీఎన్ఎస్ఎస్ తన తండ్రి వైఎస్ కలల ప్రాజెక్టు కావడంతో ఈ పనులను అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 36నెలల గడువులోగా పూర్తి చేస్తారని జిల్లావాసులు అనుకున్నారు. ప్యాకేజీ ఒకటి కింద 6.5 శాతం పనులు పూర్తిచేస్తే, ప్యాకేజీ 2 కింద 22.85శాతం పనులు మాత్రమే పూర్తిచేశారు. ఈ పనుల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లు చేశారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పనులు చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ప్యాకేజీలకు టెండర్లు ఎప్పుడో

ఒకటి, రెండు ప్యాకేజీలకు టెండర్లు పూర్తి చేసి పనులు చేపట్టారు. మిగతా నాలుగు, ఐదు, ఆరు, ఏడు ప్యాకేజీ పనులు ఇప్పటి వరకు టెండర్ల వరకు చేరుకోలేదు. ఈ పనులకు అటవీ అనుమతులే ప్రధాన అడ్డంకిగా మారాయని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

రైతులకు అందని నష్టపరిహారం

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన చాలా మంది రైతులకు ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం ఇప్పటికే అందలేదు. కొంతమంది రైతుల పొలాల్లో కాల్వలోని మట్టిని తవ్వి డంపింగ్ చేశారు. నష్టపరిహారం అందక, పంటలు సాగుచేసుకోలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులకు అందాల్సిన నష్టపరిహారం ఇవ్వడంతో పాటు కాల్వ పనులు పూర్తిచేసి రైతుల తాగు, సాగునీటి కల నెరవేర్చాలని జిల్లావాసులు కోరుతున్నారు.



చిన్నదాసరిపల్లె రెవెన్యూ పరిధిలో కాల్వకోసం తవ్వి రైతు పొలంలో డంపింగ్ చేసిన దృశ్యం

కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి



కుడాను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

- ముక్కా రూపానందరెడ్డి
- కుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం

కడప మారుతీనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నెంబర్ వన్ స్థానంలో ఉండేలా తీర్చిదిద్దుతామని ఆ అథారిటీ నూతన చైర్మన్, రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇటీవల ఆయనను కుడా చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం చిన్నచౌక్‌లోని ఆదిత్య కల్యాణ మండపంలో కుడా చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల శాసనసభ్యులతో, ఇన్‌చార్జిలతో చర్చించి కుడాను ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో తనకున్న అనుభవం మరింత దోహద పడుతుందన్నారు. ఇప్పటికే ప్రొద్దుటూరులో 40 ఎకరాలు, బద్వేల్‌లో 30 ఎకరాలు, రాజంపేటలో 20 ఎకరాలు, రాయచోటిలో 20 ఎకరాలు కేటాయించారని.. వీటికి అదనంగా మరో 20 ఎకరాలు, కోడూరులో 20 ఎకరాల భూములు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇదిలా ఉండగా ఒక్కో నియోజకవర్గంలో 50 నుంచి 60 ఎకరాల భూములను తమ అథారిటీ పరిధిలోకి ఇవ్వగలిగితే ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో సదుపాయాలు కల్పించి మరింత అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో కుడా చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతటితో ఆగకుండా కోడూరుకు ఒక విప్, రెండు చైర్మన్ పదవులు, మరో రెండు డైరెక్టర్ పదవులు ఇచ్చారన్నారు. తనకు రాజకీయ జన్మనిచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడైతే, పునర్జన్మనిచ్చింది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా సాగింది. పెద్ద ఎత్తున రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ముక్కా రూపానందరెడ్డి అభిమానులు, బంధుమిత్రులు హాజరయ్యారు. తొలుత ముక్కా రూపానందరెడ్డి చేత జేసీ అదితిసింగ్ ప్రమాణం చేయించి, పూలమొక్కను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, రామగోపాల్‌రెడ్డి, రైల్వేకోడూరు, కమలాపురం ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి, రైల్వేకోడూరు టీడీపీ నేత పంతగాని నరసింహప్రసాద్, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ దుద్యాల అనితా దీప్తి, న్యాయవాది గుర్రప్ప పలువురు నేతలు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన ముక్కా రూపానందరెడ్డికి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ అదితిసింగ్

హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలి

- భూ ఆక్రమణలను ఉపేక్షించవద్దు
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు
- హాజరైన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



శాంతిభద్రతలపై రాయలసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

కడప, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): "కడప జిల్లా అన్ని వనరుల ఖిల్లా. అక్కడ బంగారం పండించే రైతులు ఉన్నారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన వనరులూ అక్కడే ఉన్నాయి. కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చండి. పండ్ల తోటలు సాగుచేసేందుకు రైతులకు ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలను రైతులు వినియోగించేలా చేసి కడపలో పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వండి" అని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు.
అమరావతిలో రెండు రోజుల రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సును బుధవారం ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సదస్సుకు కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ హాజరయ్యారు. సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఇచ్చారు. 2024-29 సంవత్సరాలలో అభివృద్ధి కోసం జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చారు. ఇక నూతన పాలసీలు, పరిశ్రమలు, తోటల పై వచ్చే నాలుగున్నర సంవత్సరాల్లో ఎలా ముందుకెళ్లాలి, అలాగే ఆర్‌జీఎస్ వినతుల పరిష్కారం, ప్రజల్లో సానుకూల దృక్పథంపై వివరించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, అటవీ, పౌరసరఫరాలు, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల గురించి వివరించారు. రేషన్ బియ్యం అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం సూచించారు. బియ్యం అక్రమాల్లో ఎలాంటి వారినైనా ఉపేక్షించవద్దంటూ ఆదేశించారు. ఇక ప్రభు త్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని, వినతులు నమోదు చేసుకుని పరిష్కరించాలని సూచించారు. భూకబ్జాలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. అనంతరం రాయలసీమ కలెక్టర్లు, ఎస్పీలతో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆరు నెలల్లో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడవద్దంటూ సీఎం ఆదేశించారు. ఇక కలెక్టర్ల సదస్సును జేసీ అదితిసింగ్, డీఆర్వో అశ్వత్థనాయుడు, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మి, అధికారులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ కార్యాలయంలో హాజరై వీక్షించారు.

రేపు మరోసారి విచారణకు హాజరుకావాలి

- ఎంపీ పీఏ బండి రాఘవరెడ్డికి పోలీసుల ఆదేశం

కడప, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డి కేసుకు సంబంధించి కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డిని శుక్రవారం మరోసారి విచారణకు రావాల్సిందిగా పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోం మంత్రి అనిత కుటుంబ సభ్యులపై వైసీపీ సోషల్ మీడియా మోస్ట్‌వాంటెడ్ వర్రా రవీంద్రరెడ్డి అసభ్యకర పోస్టులు పెట్టారు. మాజీ సీఎం జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల, సునీతపై రాఘవరెడ్డి ఇచ్చిన కంటెంట్ మేరకే పోస్టులు పెట్టానంటూ పోలీసుల విచారణలో వర్రా రవీంద్రరెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. ఇప్పటికే అతను పులివెందులలో నమోదైన కేసుకు సంబంధించి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇదే కేసులో అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిని ఏ-20గా చేర్చారు. ఇతడిని కడప సైబర్ క్రైం పోలీసులు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో సోమ, మంగళ, బుధవారాల్లో విచారించారు. పోలీసులు ఏమడిగినా రాఘవరెడ్డి తనకు తెలియదంటూ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అతడి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు శుక్రవారం విచారణకు రావాల్సిందిగా పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. కాగా.. వైసీపీ సోషల్ మీడియాకు సంబంధించి సునీతరెడ్డి, వరకుమార్, రాజశేఖర్‌రెడ్డిలను సైతం బుధవారం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక టీం విచారించారు. సోషల్ మీడియాలో ఎవరు చెబితే పోస్టులు పెట్టారు, బ్యాక్‌గ్రౌండ్ ఏంటి ఇతరత్రా వాటిపై పోలీసులు ఆరాతీశారు.

విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు దాడులు

- విద్యుత్ సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్



రిజిస్టర్లను పరిశీలిస్తున్న చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్‌నాయుడు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలని విద్యుత్ సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్ నాయుడు తెలిపారు. బుధవారం కడప విద్యుత్ భవన్‌లోని విజిలెన్స్ విభాగంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై తగు దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరసింహారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌లు మధుసూధన్‌రెడ్డి, హుస్సేన్, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటిరెడ్డి దంపతులు కడపకు గొప్పవరం

- మహిళా కళాశాలలో వారి విగ్రహాల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటిరెడ్డి దంపతులు కడప ప్రజలకు గొప్ప వరమని వక్తలు కొనియాడారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కోటిరెడ్డి రామసుబ్బారెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మ దంపతుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ.. కోటిరెడ్డి దంపతులు స్వాతంత్ర్య సమరయోధులని, దాతృత్వం గల మహనీయులని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని పోరాటపటిమ చూపారన్నారు. ఇంతటి గొప్ప మహనీయులు అయిన కోటిరెడ్డి దంపతులు అప్పటి కాలంలోనే ఎంతో ముందుచూపుతో మహిళలకు విద్యకోసం, మహిళల అభ్యున్నతి కోసం కృషిచేసి కళాశాలను స్థాపించారన్నారు. ప్రస్తుతం కోటిరెడ్డి వారసులు తమ తల్లిదండ్రుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ఇలాంటి ఉదారస్వభావం గల కోటిరెడ్డి కుటుంబం కడప ప్రజలకు గొప్ప వరమని చెప్పారు.

కోటిరెడ్డి దంపతుల కుమారుడు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులుగా అమెరికాలోని పలు రాష్ట్రాల్లో సేవలందించానన్నారు. పదవీవిరమణ పొందిన తర్వాత తమ తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించడానికి ఈ కళాశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. వారి మరో కుమారుడు ఆంధ్రప్రదేశ్ విశ్రాంత చీఫ్ సెక్రటరీ జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ఎంతో ఉదారస్వభావం గలవారని అన్నారు. వారి కృషి వెలకట్టలేనిదన్నారు. తామంతా తమ తల్లిదండ్రులు స్థాపించిన కళాశాల అభివృద్ధి కోసం, ఈ కళాశాలలో చదువుతున్న మహిళా విద్యార్థుల విద్యాభివృద్ధికోసం, హాస్టల్‌లో ఉంటున్న గ్రామీణ విద్యార్థుల కోసం సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లవేళలా ముందుంటామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కోటిరెడ్డి కుటుంబంతో తమ కుటుంబానికి చాలా అనుబంధం ఉందని, ఈ కళాశాల అభివృద్ధి కోసం భవిష్యత్తులో తమవంతు సహకారం తప్పక అందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో కోటిరెడ్డి సుబ్బమ్మ, కోటిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కాగా.. ప్రతిభ కలిగిన 18 మంది విద్యార్థులకు, హాస్టల్‌లో ఉంటున్న 20మంది పేద విద్యార్థులకు రాబోయే మూడు సంవత్సరాలు హాస్టల్‌కు అయ్యే ఖర్చుకు సంబంధించిన ఆర్థిక సాయాన్ని కోటిరెడ్డి దంపతుల కుమారులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కోటిరెడ్డి రామసుబ్బారెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మ విగ్రహాల వద్ద వారి కుటుంబ సభ్యులు

వర్రా రవీంద్రరెడ్డి కస్టడీ పిటిషన్ 16కు వాయిదా

కడప రూరల్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డిని కస్టడీకి కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ కోర్టు (నాల్గవ అదపు జిల్లా న్యాయస్థానం) 16వ తేదీ సోమవారానికి వాయిదా వేసింది. వర్రాను పోలీస్ కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. అయితే ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను కడపలో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో న్యాయవాదులు విధులకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానం విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

జిల్లా ఇన్‌చార్జి సీపీవోగా హజరత్తయ్య

కడప కలెక్టరేట్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళిక అధికారిగా అక్కెమ్ హజరత్తయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రణాళిక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈయనను ఇన్‌చార్జి సీపీవోగా నియమించారు. కాగా జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి కె.వెంకట్రావును జాయింట్ డైరెక్టర్‌గా అమరావతి సెక్రటరీయేట్ (ప్లానింగ్ శాఖ)కు బదిలీ చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పింఛాలో జలకళ



పూర్తి నీటి సామర్థ్యంతో జలకళ సంతరించుకున్న ప్రాజెక్టు

- నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్టు
- కాలువల్లోకి నీరు విడుదల
- కుంటలు, చెరువులు నింపడమే లక్ష్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సుండుపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛా నదిపై నిర్మించిన పింఛా ప్రాజెక్టు వర్షపు నీటితో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టులోకి నీరు చేరింది. పది రోజులుగా దాదాపు 500 ఎస్టీఎంసీలు నీటిని నదికి విడుదల చేశారు. 2020 నవంబరు 26వ తేదీ అర్ధరాత్రి పై ప్రాంతాల నుంచి వచ్చిన వరదల కారణంగా పింఛా ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయింది. అప్పట్లో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులు చాలామందికి నష్టం వాటిల్లింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం తూతూ మంత్రంగా కొంతమందికి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకుంది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు మరమ్మతులు చేసేందుకు అనుమతులు రాలేదు. మూడు సంవత్సరాలైనా వైసీపీ పాలకులు స్పందించలేదు. ఆ తర్వాత సీపీఐ ఆధ్వర్యంలో పింఛా నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వరకు వందలాది మంది రైతులు, రైతు కూలీలు, స్థానిక ప్రజలు, టీడీపీ, జనసేన, ప్రజా సంఘాలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. దీంతో 2023 మార్చి నెలలో రూ.84.33 కోట్లతో పనులు ప్రారంభించారు. రెండు నెలల క్రితం ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయిపోయాయి. త్వరగా పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేయాలని కూటమి నేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తేవడం వలన కుడికాలువ గేటు ఏర్పాటు చేశారు. గేటు ఏర్పాటు పనులు జరుగుతుండగానే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండింది. రైతులకు మంచి రోజులు వచ్చాయి.

ప్రాజెక్టు ఎప్పుడు కట్టారంటే....

1954వ సంవత్సరంలో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టును 1960వ సంవత్సరంలో పూర్తి చేశారు. 1961వ సంవత్సరంలోనే ప్రాజెక్టును పరీక్షించి 1962వ సంవత్సరంలో పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయడం ప్రారంభించారు. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 0.327 ఎస్టీఎంసీలు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు 3,773.41 ఎకరాలు. ఈ ప్రాజెక్టుకు రెండు ప్రధాన కాలువలు కలవు. కుడికాలువ కింద 2211.41 ఎకరాల ఆయకట్టు ఉంది. కుడికాలువ ద్వారా అధికారికంగా 17 తూముల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తోంది. ఎడమ కాలువ కింద 1562 ఎకరాల ఆయకట్టు భూమి కలదు. ఎడమ కాలువకు రెండు బ్రాంచ్ ఛానల్స్ ఉన్నాయి. మొత్తం అధికారికంగా 14 తూముల ద్వారా పంటలకు నీరు అందిస్తారు. పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిండడం వలన మొత్తం ఆయకట్టు సాగు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల ద్వారా రైతులకు నీరు అందిస్తున్నారు.

కుంటలు, చెరువులకు జలకళ

పింఛా ప్రాజెక్టు మీద ఆధారపడి ఉన్న 12 కుంటలు, చెరువులు కూడా వర్షపు నీటితో కళకళలాడనున్నాయి. కుడి కాలువ ద్వారా ఒడ్డుకుంట, రెడ్డిచెరువు, రవ్వల కుంట, సుబ్బయ్యకుంట, పాలెంగడ్డ కుంటలు నిండి ఉన్నాయి. రెడ్డిచెరువు ద్వారా 90 శాతం ప్రాజెక్టు నీటితో ఇప్పటికే నిండింది. నీటిలో కళకళలాడుతోంది. ఎడమ కాలువ ద్వారా విడుదల చేసే నీటితో చిన్న నాగిరెడ్డికుంటలు రెండు, అత్తాకోడలు కుంటలు, కొత్తపల్లికుంట, అయ్యవారిచెరువు నిండనున్నాయి. ఈ చెరువులు, కుంటలు పూర్తి సామర్థ్యంతో నిండితే బోరు బావుల్లో పుష్కలంగా నీరు వచ్చి రైతులకు సాగునీటి సమస్య లేకుండాపోతాయి. అలాగే ఆ చెరువులు, కుంటల కింద ఉన్న సాగు భూములకు సాగునీటి సమస్యలు ఏర్పడవని రైతులు చెబుతున్నారు.

తాండాలకు వరప్రసాదిని

పింఛా, పెద్దినేనికాలువ, రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె ప్రాంతాల ప్రజలకు పింఛా ప్రాజెక్టు వరప్రసాదిని. ముఖ్యంగా ఒకప్పుడు నాగరిక సమాజానికి దూరంగా ఉండే తాండాలు పింఛా ప్రాజెక్టు నిర్మాణంతో వారి దశ తిరిగింది. ప్రాజెక్టు నిర్మాణంతో సుండుపల్లె మండలంలోని 15 గిరిజన తాండాల ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇప్పటికీ వందల కుటుంబాలు ప్రాజెక్టును నమ్ముకుని వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం

ఆహ్లాదకరమైన వాతావరణం. ఆకర్షణీయమైన దృశ్యాలతో సందర్శకులను ఇట్టే ఆకట్టుకునే ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లాలోని పింఛా ప్రాజెక్టు ఒకటి. సందర్శకులకు ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడం, ఉన్న వాటి గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు సందర్శకుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రాజెక్టు దిగువ భాగంలో ఏర్పాటు చేసిన పార్కు నివర్ తుఫాను కారణంగా పెద్ద పెద్ద వృక్షాలు, కట్టడాలు కొట్టుకుపోయాయి.ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న అతిథి గృహాలను ఎవ్వరూ పట్టించుకోకపోవడం వలన శిథిలమై పిచ్చిమొక్కలతో నిండి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారింది. జిల్లా అధికారులు, పర్యాటకశాఖ వారు పింఛా సోయగాలపై దృష్టి పెట్టి వాటిని అభివృద్ధి చేస్తే పింఛా పర్యాటకులను ఆకర్షించగలరని స్థానికులు కోరుతున్నారు.

మంచి రోజులు వచ్చాయి



ప్రాజెక్టు దిగువ భాగంలో ఉండే రైతులకు మంచి రోజులు వచ్చాయి. నాలుగు సంవత్సరాల తర్వాత ప్రాజెక్టు నిండింది. ఈ కారు ప్రతి రైతు పంటలు పండించుకోవచ్చు. సకాలంలో గేటు మరమ్మతులు చేసి నీరు నిల్వ చేయడం సంతోషదాయకం.

- వెంకటరమణ నాయుడు, రైతు, నగిరి

ప్రాజెక్టు పూర్తిగా నిండింది

ప్రాజెక్టు నీటి సామర్థ్యంతో నిండింది. ఈ ఏడాది రైతులకు సాగునీటి సమస్య ఉండదు. రైతులు నీరు వృథా కాకుండా వినియోగించుకోవాలి. ప్రాజెక్టుకు నూతనంగా మరవ ఏర్పాటు చేశాము. దాదాపు పనులు పూర్తి అయిపోయాయి.

- నాగేంద్రనాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా జలాశయం



కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు

ప్రభుత్వ భూమి కబ్జా యత్నం



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామం సర్వే నంబరు 293లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బుధవారం కొంతమంది ప్రయత్నించారు. హైకోర్టు ఆర్డరు ఉందంటూ ఎక్స్‌కవేటర్‌తో ప్రభుత్వ భూముల్లో చెట్లను తొలగించడం మొదలుపెట్టారు. అడ్డుకున్న వీఆర్ఏలను బెదిరించారు. సమాచారం అందుకున్న తహసీల్దారు అమర్‌నాథ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో కబ్జాదారులు పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమినే చదును చేశారు...



కబ్జా చేసేందుకు చదును చేసిన ప్రభుత్వ భూమి

సిద్దవటం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ ఉప్పరపల్లె గ్రామానికి చెందిన సర్వేనంబరు 1114 లోని 5.09 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు చదును చేస్తున్నా అధికారులు అటువైపు చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రదేశానికి తమ సిబ్బందిని పంపించామని, భూమి చదును చేసిన వారు తమ దగ్గరున్న పత్రాలను తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించామన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో దోపిడీని అరికట్టండి

మదనపల్లె ప్రభుత్వాస్పత్రి ఎదుట సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన



జిల్లాప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలియచేస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి ఎదుట వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మదనపల్లె కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఆస్పత్రి డాక్టర్లు ప్రైవేట్‌గా స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్, ఎక్స్‌రేలు ఏర్పాటు చేసుకొని రోగులకు అవసరం లేకున్నా వారి సెంటర్లలో తీయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లు కొరత కారణంగా అప్రంటీస్ డాక్టర్లే అత్యవసర విభాగాల్లో ఉండడం, అవసరమైన పరికరాలు అందుబాటులో లేని కారణంగా చిన్న చికిత్సకు బయటకు రెఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గాయత్రికి జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడి ప్రసాద్‌కుమార్, ఐటీయూసీ మదనపల్లె డివిజన్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడిప్రసాద్ మాట్లాడారు. అలాగే జేసీకి, జిల్లా కలెక్టర్‌కు, డీఎం అండ్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు మాధవ, గంగరాజు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్, జశ్వంత్, నాగేంద్ర, వరప్రసాద్, గణేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పర్యాటకంపై జాతీయ సదస్సు

పీలేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో గురు, శుక్రవారాల్లో పర్యావరణ పర్యాటకంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి తెలిపారు. 'పర్యావరణ పర్యాటకం(ఎకో టూరిజం)-సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై భారతీయ సామాజిక శాస్త్రాల పరిశోధనా మండలి(ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో ఈ సెమినార్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్ రావుల ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సదస్సులో పాండిచ్చేరిలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య వై.వెంకటరావు కీలక ఉపన్యాసం ఇస్తారన్నారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు హాజరై పర్యావరణ పర్యాటక రంగంలోని ధోరణులు, అవకాశాలు, సవాళ్లపై చర్చిస్తారని ఆయన తెలిపారు. ఔత్సాహికులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ ఎరువుగా వర్మీకంపోస్ట్



వర్మీకంపోస్టు తయారీ గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రీయ ఎరువుగా వర్మీకంపోస్టును రైతులు ఎవరంతకు వారే తయారు చేసుకోవడం సులువైన పనేనని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. గ్రామాల్లో పాడి ఆవుల పోషణ విస్తృతంగా వున్నందున ఆవు పేడ తగినంతగా లభిస్తుందని, దీంతో వర్మీకంపోస్టును తయారు చేసి పంట పొలాల్లో వినియోగిస్తే భూసారం పెరగడంతోపాటు పంటలకు రోగ నిరోధక శక్తి కూడా సమకూరుతందని చెప్పారు. గత వారం రోజులుగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీ గురించి జరుగుతున్న శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం శిక్షణలో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ యువ రైతుల కోసం నిర్వహించిన శిక్షణలో అనేక ప్రయోజనాలతో వర్మీకంపోస్టు తయారీ గురించి క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ మంజుల, వీఏఎస్ డాక్టర్ సి.హెచ్. గిరనాథ్, కేవీకే శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వివాదరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్న జిల్లా సర్వేయర్ భరత్‌కుమార్, తదితరులు

కురబలకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలను వివాదరహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా సర్వేయర్ భరత్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతమాకుపల్లెలో గ్రామరెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న వివిధ రకాల భూ సమస్యలతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చామని, వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల సమస్యలపై 35 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, తహసీల్దార్ తపస్విని, డీటీ శాంతమ్మ, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి





సంఘటనా స్థలంలో మృతి చెందిన రైతు సూర్యనారాయణ (ఫైల్)

ములకలచెరువు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బొలెరో లగేజీ వాహనం ఢీకొనడంతో ఓ రైతు దుర్మరణం చెందిన సంఘటన ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వంతెన వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ గొళ్లపల్లెకు చెందిన కొండా సూర్యనారాయణ (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య శాంతమ్మ, కుమారుడు రంజిత్‌కుమార్, కుమార్తె రజనీ ఉన్నారు. కాగా మదనపల్లెలో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్న తన కుమారుడికి బస్సులో కూరగాయలు పంపేందుకు ఆ రైతు ద్విచక్ర వాహనంలో కదిరినాధునికోట బస్టాప్ వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి దాటి రోడ్డు పక్కకు వెళ్తున్న సమయంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

మా షాపులో కొంటే.. కేసులుండవు..

- బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం దుకాణ యజమానుల భరోసా
- గ్రామాల్లో బెల్టుషాపుల జోరు



గుర్రంకొండ జీవన్‌తోపు రోడ్డు మార్గంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు

గుర్రంకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణం, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యానికి పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో మద్యం దుకాణదారులు ఇష్టానుసారంగా మద్యాన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి పంచాయితీ పరిధిలో జనాభా ఉన్న ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు బెల్టు షాపులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం బెల్టు షాపులను నిర్వహిస్తే బెల్టు తీస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా గ్రామస్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా మద్యం దుకాణదారులు తమదంటే తమ దుకాణంలో మద్యం తీసుకెళ్లాలంటూ బెల్టు షాపుల నిర్వాహకులకు పోటీపడి మరీ మద్యం ఇస్తున్నారు. తమ దుకాణంలో మద్యం తీసుకొంటే ఎక్సైజ్, పోలీసులు పట్టుకుంటే మేమే అండగా ఉంటూ కేసులు లేకుండా చూస్తామని దుకాణదారులు బెల్టుషాపు నిర్వాహకుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు. దీంతో బెల్టు షాపు నిర్వాహకులు మద్యం దుకాణదారుల మధ్య పోటీని గమనించి వారం ఓ షాపులో, రెండవ వారం మరో షాపులో మద్యాన్ని తీసుకెళుతున్నారు. అంతేకాకుండా బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం అప్పుగా ఇవ్వడం కొసమెరుపు. ఈ క్రమంలో ఊరురా మద్యం అమ్మకాల కోసం బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయి. అంతేకాకుండా ప్రభుత్వం పర్మిట్‌రూములకు పర్మిషన్ ఇవ్వకపోయినా అనధికారికంగా మద్యం దుకాణాల పక్కనే రూములు ఏర్పాటు చేసుకుని అక్కడే మద్యం తాపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీల్లో సుమారు 33వేల మంది ఓటర్లు ఉన్నారు. జనాభా ప్రాతిపదికన మండలానికి ప్రభుత్వం మూడు మద్యం దుకాణాలను మంజూరు చేసింది. ఇందులో రెండు మద్యం షాపులను మండలానికి చెందిన వారు దక్కించుకున్నారు. ఒక షాపును మదనపల్లెకు చెందిన వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో గుర్రంకొండ పట్టణం జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెండు మద్యం షాపులను ఏర్పాటు చేశారు. అలాగే మదనపల్లెకు చెందిన వ్యక్తి మూడవ షాపును తరిగొండ గ్రామంలోని రామాపురం రోడ్డులో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మద్యం అమ్మకాలను పెంచుకోవడానికి నిర్వాహకులు ఇష్టానుసారంగా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులు, మహిళలకు కష్టాలు..

గుర్రంకొండ జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం పూట విద్యార్థులు ఈ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను ఉంచడంతో రద్దీగా ఉంటూ మద్యం ప్రియులతో గందరగోళంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థినులు కాలేజీకి పోయి రావాలంటే ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కేసు నమోదు చేస్తాం..

గుర్రంకొండ మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులను నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేస్తాం. అలాగే మద్యం దుకాణాల వద్ద కానీ, పక్కన కానీ కూర్చుని తాగడానికి అనుమతి లేదు. దుకాణాల వద్ద మద్యం తాగుతున్నట్లైతే వాటిని తొలగిస్తాం. గ్రామాల్లో తిరిగి బెల్టుషాపులు లేకుండా రూపుమాపుతాం.

- లత, ఎక్సైజ్ సీఐ, వాల్మీకిపురం సర్కిల్

రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది దిగుబడి బాగుంటే ధర ఉండదని.. ధర ఉంటే దిగుబడి ఉండదని వాపోతున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయడం కష్టమని.. ఏ పంటా సాగు చేయలేమని.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాశిగా పోసిన వరి ధాన్యం

దిగుబడి బాగుంది... ధర పడిపోయింది

- గత ఏడాది పుట్టి ధాన్యం రూ.16 వేలు
- ఈ ఏడాది రూ.10 వేలకు పడిపోయిన ధర
- ప్రైవేటు వ్యాపారస్థుల దోపిడీ
- ఆవేదనలో రైతన్నలు.. ● పట్టించుకోని ప్రభుత్వాలు

చాపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మండలంలో కేసీ కెనాల్, చాపాడు చానెల్ కింద ఖరీఫ్ సీజన్‌లో సుమారు 26 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకుంది. జగిత్యాల, బీపీటీ 5204, సన్నాలు, జిలకర వంటి రకాలను సాగు చేశారు. రైతులు వరి కోత మిషన్ల ద్వారా కోతలు కోస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. కడప, చెన్నై, బెంగుళూరుకు చెందిన వ్యాపారులు పుట్టి (8 బస్తాలు) రూ.10,500 నుంచి రూ.11,300 వరకు ధర పెట్టి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది పుట్టి వరి ధాన్యం రూ.16 వేలు ధర పలకగా.. ఇప్పుడు దాదాపు రూ.5 వేలు ధర తక్కువగా ఉందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి బాగుందని సంతోషపడితే.. ధర ఒక్కసారిగా పడిపోవడంతో తమ ఆశలు అడియాశలయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక ఎకరా సాగుకు సుమారు 30 వేలు ఖర్చు అయ్యిందని.. ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవంతో వ్యాపారస్థులు ఇష్టానుసారంగా అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. లక్ష్మీపేట, సోమాపురం, కేతవరం, చాపాడు, చియ్యపాడు, విశ్వనాథపురం, భద్రిపల్లె తదితర గ్రామాల వద్ద కోతలు కోస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షం వస్తుందేమోనని భయంతో రైతులు వరి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఇళ్లలో నిలువ చేసుకునేందుకు స్థలం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మద్దతు ధర పెంచి, పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



సంచుల్లో నింపిన వరి ధాన్యం



కోత దశకు చేరుకున్న వరి పైరు

పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలి



గత ఏడాది పుట్టి (8 బస్తాలు)ధాన్యం ధర రూ.16వేలు పలికితే... ఇప్పుడు ప్రైవేటు వ్యాపారస్థులు రూ.10,500లకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా వరి సాగు చేసినందుకు రూ.30వేలు ఖర్చు అయ్యింది. నాలుగు నెలలపాటు కష్టపడితే రూ.10వేలు మిగులుతున్నాయి. ఇలా అయితే ఎలా వ్యవసాయం చేసేది. ప్రభుత్వం పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలి.

- శ్రీనివాసులు, రైతు, కేతవరం గ్రామం

వ్యాపారస్థులు చెప్పిందే ధర



వరి ధాన్యం కొనుగోలులో ప్రైవేటు వ్యాపారస్థులు చెప్పిందే ధర.వాళ్లు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది. పుట్టి రకాన్ని బట్టి రూ.10,500 నుంచి రూ.11,300లకు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి బాగుందిలే అనుకుంటే ధర ఒక్కసారిగా తగ్గించారు. నిల్వ చేసుకుందామనుకుంటే వాన భయం పట్టుకుంది. ప్రభుత్వం రూ.16 వేలకు కొనుగోలు చేయాలి.

- దస్తగిరి, రైతు, కేతవరం గ్రామం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించి... ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన పలువురిని కలచివేసింది. మైదుకూరు మండలం జీవిసత్రం పరిధి లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన వెంకట రమణారెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వినోద్‌కుమార్ రెడ్డి (22) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. బుధవారం తెల్ల వారుజామున సొంత పని నిమిత్తం మైదుకూరు వెళుతున్న తన తండ్రిని వదిలిపెట్టేందుకు బైక్‌పై బయలుదేరాడు. గడ్డంవారిపల్లె వద్దకు వెళ్లగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట రమణారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ మురళీయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వినోద్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ఉరివేసుకుని వ్యక్తి మృతి

సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని యూసఫ్‌బాష(37) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఎఎల్‌కాలనీలో గత కొంత కాలంగా యూసఫ్‌బాష ఒంటరిగా ఉంటున్నాడు. కడప నగరానికి చెందిన ఇతను భార్య, పిల్లలతో విడిపోయి... డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఓనర్ వద్ద బైక్ తీసుకుని వచ్చి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటు కూరు రింగు రోడ్డు సమీపంలో బుధవారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏరువాక కేంద్రంలో పనిచేసే పూర్ణచంద్ర, మరో వ్యక్తి బైక్‌లు అదుపు తప్పి ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనాల్లో రిమ్స్‌కు తరలించగా.. మెరుగైన చికిత్స కోసం పూర్ణచంద్రను తిరుపతికి తరలించినట్లు తెలిసింది. మరో వ్యక్తి సమాచారం తెలియాల్సి ఉందని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో గత నెల 16న జరిగిన దాడి కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గత నెల 16వ తేది రాత్రి చిలకలబావి వద్ద అరబత్‌ను ఇలియాస్, సలీమ్, బన్నీ, తాజ్‌లు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

పోరుమామిళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన కట్టమూరి శిరీష్ అనే వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రామిరెడ్డిగుంటకు చెందిన నాగిరెడ్డి శంకర్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర నుంచి కట్టమూరి శిరీష్ 2022 సంవత్సరంలో రూ.45 లక్షలకు సంబంధించి 90 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి అడ్వాన్స్‌గా రూ.20 లక్షలు ఇచ్చాడు. మిగిలిన రూ.25 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది కలుగజేస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్టు

పెద్దమండ్యం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తల్లి హత్య కేసులో తనయుడి (ఓబులేసు)ని అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న వెల్లడించారు. సీఐ వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామంలో బోడెం ఓబులేసు మద్యానికి బానిసై తల్లి ఓబులమ్మ(60)ను డబ్బుల కోసం వేధించేవాడు. ఈ క్రమంలో ఆమె డబ్బులు ఇవ్వలేదని కోపంతో కర్రతో దాడి చేశాడు. తలకు, కాళ్లకు క్రూరంగా కొట్టడంతో రక్తపుమడుగులో పడిపోయింది. గ్రామస్తులు గుర్తించి పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓబులమ్మకు చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరిగి ఇంటికొచ్చిన రెండు రోజుల తరవాత ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కాగా నవంబరు 24న వృద్ధురాలు ఓబులమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు పెద్దమండ్యం ఎస్‌ఐ పీవీ రమణ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు ములకలచెరువు సీఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో వేగవంతం చేశారు. నిందితుడి కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో బుధవారం నిందింతుడు ఓబులేసును పెద్దమండ్యం బస్టాప్ వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్‌కు ఆదేశించించినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప మారుతీనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేసి ఆయా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసి అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విద్యుత్‌రంగం ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సదస్సు జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామలింగారెడ్డి, శివయ్య, బాలకాశి మాట్లాడారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెనుమార్పులకు శ్రీకారం చుడుతున్నాయన్నారు. ఈ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు వేగంగా పావులు కదుపుతున్నతీరు సరికాదన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లు తీసుకువచ్చారన్నారు. అదే తరహాలో గృహాలకు కూడా తీసుకురానున్నారని వెల్లడించారు. నిత్యావసరమైన విద్యుత్‌ను ప్రైవేటు వారికి ధారాదత్తం చేస్తే ప్రజలతో పాటు దేశ భద్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, యూనియన్ డిస్కం కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు నాగిరెడ్డి, సురేష్, హరికేశవరెడ్డి, కేశవ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

పెండ్లూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

వేముల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లూరు గ్రామంలో మంగళవారం ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డిపై అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై పెద్దఎత్తున అవినీతి చేసినట్లు ఆధారాలతో ఆ గ్రామ నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టేందుకు మంగళవారం గ్రామానికి వచ్చిన అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ విచారణలో ఫిర్యాదుదారులపైనే శివాలెత్తడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేశా రు. విచారణలో ఆధారం చూపుతుంటే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉపాధి హామీ పథకంలో పనిచేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పనిచేసినట్లు ఎఫ్‌ఏ నమోదు చేశాడని చెప్పగా.. విచారణ అధికారి నాగరత్నమ్మ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కేవలం రూ.5వేలు, రూ.6వేలు డబ్బులు జీతం వస్తుందని అటువంటి వారు పనిచేయకూడదా అంటూ ఫిర్యాదుదారులపైనే ఎదురు ప్రశ్నించారు. అలాగే పలు ఆధారాలను ఆమె ముందు ఉంచగా నేనేమైనా లైట్లు వేసుకొని చూడాలా మీరే ఇవ్వండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తేలిసింది. అలాగే ప్రభుత్వం మారిన వెంటనే ఎఫ్‌ఏను ఎందుకు తొలగించాలని ఫిర్యాదు దారులనే ఎదురు ప్రశ్నించడంతో ఇదెక్కడి న్యాయమంటూ ఫిర్యాదు దారులు ఆగ్రహంతో విచారణ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం ఫిర్యా దుదారులైన అవేంద్రరెడ్డి, చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ మేము పూర్తి స్థాయిలో ఆధారాలతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఆధారాలు అన్నింటిని ఉపాధి హామీ అధికారులు ముందుగానే ఆ ఎఫ్‌ఏ సుదర్శన్‌రెడ్డికి పంపించడం జరిగిందని.. అలాగే విచారణకు వచ్చిన ఏపీడీ పూర్తి స్థాయిలో వన్‌సైడ్‌గా విచారణ చేస్తోందని తెలిపారు. ఏపీడీ నాగరత్నమ్మను తప్పించి మరో విచారణ అధికారిని నియమించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని వారు జిల్లా అధికారులను కోరారు.

ఈడబ్ల్యూఎస్ శాఖలోకి ఆరు కార్పొరేషన్లు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన శాఖ (ఈడబ్ల్యూఎస్) పరిధిలోకి ఆరు కార్పొరేషన్లను తీసుకొస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రెడ్డి సంక్షేమ కార్పొరేషన్, కమ్మ సంక్షేమ కార్పొరేషన్, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్, క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్పొరేషన్లను పాలనకు అనుకూలంగా ఈడబ్ల్యూఎస్ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు.

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ

- ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ పాఠశాలల్లో ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించనుంది. ఈ డీఎస్సీ పరీక్షల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు 26 జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా కోచింగ్ ఇస్తున్నారు. ఇప్పుడు అదనంగా ఆన్‌లైన్ విధానంలో కూడా శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వగలిగిన కోచింగ్ సంస్థల నుంచి టెండర్లు కూడా పిలిచారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్ విధానంలో టెండర్ వేయాలని ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యం

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యమని ఆంధ్రాయూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ ఆదినారాయణ తెలిపారు. బుధవారం వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూని వర్సిటీలో భారతీయ ఉత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం డాక్టర్ శివరామ సురేంద్రశర్మ మాట్లాడుతూ అవగాహన ప్రక్రియ తెలుగుభాషకు మాత్రమే ప్రత్యేకవరమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ వై.వర లక్ష్మి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలో డమ్మీ తుపాకీతో హల్‌చల్

- బాకీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై దాడి

పులివెందుల టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు అడిగినందుకు డమ్మీ తుపాకీతో ఓ వ్యక్తి తలపై కొట్టి గాయపరిచిన సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. బుధవారం పట్టణంలోని లయోల డిగ్రీ కళాశాల సమీపంలో క్లబ్ దగ్గర ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన నాగిరెడ్డి తనకు బాకీ ఉన్న డబ్బులు ఇవ్వాలని శివప్రసాద్‌ను అడగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. శివప్రసాద్ తన మిత్రుడు చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో బబ్లూ అక్కడకు వచ్చి నాటు తుపాకీతో నాగిరెడ్డి తలపై కొట్టి తీవ్రంగా గాయ పరిచాడు. బాధితుని స్థానికులు వైద్యం కోసం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తర లించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పులివెందులలో జరిగిన సంఘటనపై నాటు తుపాకీ హల్‌చల్ అని సోషల్ మీడియాలో రావడంపై సీఐ స్పందించారు. అది డమ్మీ బొమ్మ తుపాకీ అని తెలిపారు. ఈ సంఘటనకు కారకులైన శివప్రసాద్, చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గాయపడిన నాగిరెడ్డి

నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కోర్సులు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వైవీయూ, హైదరాబాద్ సంస్థల ప్రతినిధులు

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ వీసీ చాంబర్‌లో హైదరాబాద్ స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థతో వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. వీసీ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, స్కిల్ డిజైర్ సంస్థ సంచాలకులు శ్రీకాంత్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ ద్వారా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తామన్నారు. మద్రాస్ ఐఐటీ మోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. వైవీయూ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి చేయడం ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, యూనివర్సిటీ డీన్ కేజీ దాము, గంగయ్య, డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ రెడ్డయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదు : డీఎంహెచ్‌ఓ



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

వేంపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదని, తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. కొద్దిరోజులుగా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆరాతీసి ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని బుధవారం సందర్శించింది. డీఎంహెచ్‌ఓ నాగరాజు, పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీవో చిన్నయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత మొదట ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులు, ఒంగోలు క్యాంపస్ విద్యార్థులతో మాట్లాడారు. ఆస్పత్రిని సందర్శించి స్థానిక వైద్యులతో మాట్లాడారు. మెస్, నీటి సరఫరా ప్రాంతాలను పరిశీలించారు. ఫుడ్ పాయిజన్ ఎవరికీ కాలేదని నిర్ధారించుకున్నారు. పాత క్యాంపస్‌లో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఇక్కడి మసాలాలు పడకపోవడం వల్ల కొందరికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వచ్చాయని, మిగిలిన విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదని డైరెక్టర్, వైద్యులు ఉన్నతాధికారులకు వివరించారు. మెస్‌లోని ఆహారపదార్థాలు, తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కాగా ఒంగోలు క్యాంపస్‌లో మసాలాలు తగ్గించాలని, క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే బయటి ఫుడ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని అధికారులకు విద్యార్థులు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ తెలిపారు.

రైతు శ్రేయస్సు కోసమే సదస్సులు

కడప ఆర్డీఓ జాన్ ఎర్వీన్ ● చింతకొమ్మదిన్నె మండలం పెద్దకాంపల్లెకు శ్మశానం కేటాయింపు

వల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులను అభివృద్ధి చేస్తూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఎర్వీన్ అన్నారు. బుధవారం కోట్లూరు పంచాయతీలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేలా చేపట్టిందన్నారు. ఎవరైతే సదస్సులో అర్జీలు ఇస్తారో వారు సంబంధిత ధృవీకరణ పత్రాలు సక్రమంగా అందజేస్తే ఆ సమస్యను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఎవరికైనా రికార్డు పరంగా లేకపోయినా ఏదేని ఆధారంగా కాగితం వున్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రధానంగా రైతులు చేయాల్సిందే మంటే సరైన ధ్రువీకరణ పత్రాలు ఇస్తే సమస్య త్వరితగతిన పరిష్కారం కాగలదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయింపు

సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో ప్రజలు శ్మశానం కోసం స్థలం కావాలని కోరగా తహసీల్దారు నాగేశ్వరరావు వెంటనే స్పందించి రెండెకరాల స్థలాన్ని శ్మశానానికి కేటాయించారు. పెద్దకాంపల్లెలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పెద్దకాంపల్లె గ్రామస్థులు తమ గ్రామానికి శ్మశానం లేక ఎన్నో ఏళ్ల నుంచి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వీఆర్వో, సర్వేయర్లతో కలిసి తహసీల్దారు ఖాళీ స్థలాన్ని చూసి వెంటనే అక్కడికక్కడే రెండెకరాల స్థలాన్ని కేటాయించారు.

కార్యక్రమంలో ఆర్ఐ అబ్బిరాజు, సర్వేయర్లు ఓబులేసు, వీఆర్వో సౌమ్య, టీడీపీ నేత గంధం మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దకాంపల్లె శ్మశానానికి స్థలం పరిశీలిస్తున్న తహసీల్దారు నాగేశ్వరరావు తదితరులు

చాబలి పొలంలో....

పెండ్లిమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం రైతుల వద్దకే వెళ్లి గ్రామసభ సభలు నిర్వహిస్తారని తహసీల్దార్ అనురాధ తెలిపారు. మాచునూరు పంచాయతీ చాబలి రెవెన్యూ పొలం పరిధిలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, టీడీపీ నేతలు ఆరవేటి చంద్రారెడ్డి, రాజారెడ్డి, అంకిరెడ్డి, బ్రహ్మయ్య, బాలవీరయ్య, కృష్ణారెడ్డి, రామమునిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

శివాలపల్లె రెవెన్యూ సదస్సులో...

చెన్నూరు డిసెంబర్ 11, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యవసాయ భూముల సమస్యలను అధికారులకు తెలిపి శాశ్వతంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సరస్వతి అన్నారు. శివాలపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా భూ సమస్యలతో ఇబ్బందిపడే రైతులకు సదస్సులు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రతి రైతు సమస్యను తెలిపి 45 రోజుల్లోగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాల్లో హద్దుల సమస్య, కొలతల్లో తేడాలు, ఆన్‌లైన్ లాంటివి వుంటాయన్నారు. అవన్నీ పరిష్కరించేందుకు అధికారులే మీ వద్ద వున్నారన్నారు. తదనంతరం రైతులు వివిధ సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి నేరుగా కొందరు రైతుల ఇళ్లవద్దకు వెళ్లి వారితో మాట్లాడి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్వే డ్యూటీ అర్చన, ఆర్ఐ కౌశిక్, వీఆర్ఓ వెంకటసుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు వెంకటశివా రెడ్డి, ఆరిఫ్, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మహాద్భుతాలు సృష్టించే డోరెమాన్ అంటే చిన్నారుల్లో అమితమైన క్రేజీ. డోరెమాన్ బొమ్మ కన్పిస్తే చాలు కేరింతలు కొడతారు. టీవీలో డోరెమాన్ చిత్రాలు చూస్తూ అన్నం తింటున్నారంటే ఆశ్చర్య పోనక్కరలేదు. అదే బొమ్మ చేతికొచ్చిందంటే పిల్లల ఆనందం అంతా ఇంతా కాదు. మరి ఆ ఆనందాన్ని అందించే ఇతడికి డోరెమాన్ బొమ్మలమ్మితే కానీ కడుపు నిండదుమరి. కడప నగరంలోని క్రిష్ణాసర్కిల్‌లో అమ్మకానికి తీసుకెళుతున్న బొమ్మలతో ఓ యువకుడు ఇలా కన్పించాడు....

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం


అశేష భక్తజన సందోహంలో శ్రీనివాస కల్యాణం

కడప కల్చరల్, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం వేంకటేశ్వర గోవిందమాల భక్త బృందం (కడప) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కళాక్షేత్రంలో శ్రీదేవి, భూదేవి, సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తిలకించారు. కార్యక్రమానికి ముందుగా మైసూరు దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు, రుగ్వేద అధ్యాపకులు, సంతోష్‌కుమార్ ఘనపాటి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ తిరుమల తొలి గడపగా ఖ్యాతి గాంచిన దేవుని కడప వేంకటేశ్వరస్వామి ఆలయం నాటి విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి అపూర్వ కట్టడమన్నారు. కావున ఆలయ ప్రసిద్ధిని మరింతగా ఖ్యాతిగాంచేలా పాలకులు మరింతగా దృష్టి సారించాలన్నారు. గోవిందమాల భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. బుగ్గలపల్లి, బోడెద్దులపల్లెల్లో బుధవారం పొలం పిలుస్తోంది లో ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఈ సీజన్‌లో పంట ఇన్సూరెన్స్ చేసుకునేందుకు డిసెంబరు 31 వరకు అవకాశం ఉందన్నారు. మిగిలిన పంటలకు 15వ తేదీ గడువని రైతులు తమ పంటలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని బీమా పొందాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందితో పంట నమోదు చేసుకుని పంటల బీమాకు అర్హత పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రేఖ, శిల్ప, రైతులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో అభివృద్ధి

వల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని మండలాధ్యక్షురాలు మల్లీశ్వరి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రఘురాం, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య అధ్వర్యంలో నిర్వహించిన మండల సమావేశంలో మండల అభివృద్ధి అంశాలను, ప్రణాళికలను ఆయా శాఖల వారీ సభకు చదివి వినిపించారు. సర్పంచ్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పంట నమోదులో సర్వర్ చాలా నిదానంగా పనిచేస్తోందని ఏఓ దృష్టికి తీసుకురాగా వ్యవసాయ అధికారి స్పందించి సదరు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, రైతులు, గ్రామస్థులు, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సమాచారం ఏర్పాటు'

సింహాద్రిపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై సమాచార బోర్డులో సంబంధిత సమాచారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వర్గీకరణ విచారణ సంబంధించి విచారణ కమిషన్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేశారన్నారు. దీనికి సంబంధించి సంతకంతో కూడిన రాతపూర్వక సూచనలు, సలహాలు జనవరి 9లోగా అందజేయవచ్చన్నారు. అదేవిధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా సమాచారం పంపవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఎస్సీలు సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన సూచించారు.

దోమల నివారణ చర్యలు చేపట్టండి


ప్రజలతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్

పెండ్లిమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్ ప్రజలకు సూచించారు. నంది మండలం పీహెచ్‌సీ రికార్డులు తనిఖీ చేపట్టిన ఆయన డెంగ్యూ కేసు నమోదైన బుడ్డాయపల్లె, గున్యా కేసు నమోదైన చౌటపల్లె గ్రామాలను సందర్శించారు. మూడు రోజులకు ఒకసారి తొట్లు, బానలు, కూలర్లు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలని, వేపా కుతో పొగ వేసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ రామప్రతాప్, ఎంపీహెచ్ఎస్ రవీంద్రనాథ్, సీహెచ్ఓ సరోజ, ఏఎన్ఎం సంధ్య, ఆశాలు లక్ష్మీదేవి, శకుంతల పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరవు : డీసీసీ

కడప కలెక్టరేట్ డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలికలు, ఆడబిడ్డలపై అత్యాచారాలు పెచ్చురిల్లుతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సిగ్గు చేటని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి మండిపడ్డారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో మూడేళ్ల చిన్నారి తన బంధువు చేతిలో లైంగిక దాడిలో హత్యకు గురైన సంఘటన రాష్ట్ర ప్రజలను కలిచి వేసిందన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో 17 ఏళ్ల బాలిక లహరిపై లైంగిక దాడికి గురికాగా, జిల్లాలోని వేములలో ఓ మహిళపై హత్యాయత్నం సంఘటనలు తదితర ఉదంతాలు మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోందని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో హోంశాఖ మంత్రి పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

వేంపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి పురస్కరించుకుని వేంపల్లె వడ్డె వీధిలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దేరంగుల రామాంజనేయులు ఆధ్వర్యంలో పూజారి ప్రసాద్ బుధవారం ఉదయం అభిషేకపూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరంచి పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్ఐ నారాయణ, రాజంపేట మున్సిపల్ ఉద్యోగి బాలెం హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె చైతన్య హైస్కూల్లో గీతా పారాయణం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు శ్రీకృష్ణునికి ప్రత్యేకపూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకుని మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

పిల్లల్లో ప్రతిభను గుర్తించాలి

చక్రాయపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులమనే భావన పిల్లల నుంచి తొలగించి వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నాగులగుట్టపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సంజీవ్‌కుమార్ అన్నారు. బుధవారం నాగులగుట్టపల్లె భవిత సెంటర్‌లో 65వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈనెల 5వ తేదీన జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో ముగ్గురు సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలైన అరీఫ్, మైథిల, ఈశ్వరమ్మకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులకు స్వీట్లు, స్టీల్ బాక్సులు అందించారు. నాగులగుట్టపల్లె ఎంపీపీఎస్ హెచ్ఎం బాబా ఫక్రుద్దీన్, ఐఈఆర్టీలు సత్యనారాయణ, లలిత, ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'పరిష్కారానికి సదస్సులు దోహదపడాలి'


సమావేశంలో మాట్లాడుతున్న గాలి చంద్ర

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబర్ 11, (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో యధేచ్ఛగా సాగిన భూ దందా అక్రమాలను నిగ్గుతేల్చేలా ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ పాలనలో సాగుతున్న రెవెన్యూ సదస్సులు దోహదపడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో పార్టీ నేతలు బాదుల్లా, గంగా సురేష్, గిరిజన సమాఖ్య నాయకులు శంకర్‌నాయక్, ఏఐటీయూసీ నేతలు లింగన్న పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయండి

విజిలెన్స్ కార్యాలయం తనిఖీ చేసిన సీఈఓ


రికార్డులు పరిశీస్తున్న సీఈఓ జనార్థన్ నాయుడు

కడప(క్రైం)డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కరెంటు సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తే కేసులు నమోదు చేయలంటూ ఏపీటీఎస్ తిరుపతి సీఈఓ జనార్ధన్ నాయుడు సిబ్బందిని ఆదేశించారు. కడప విద్యుత్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆయన రికార్డులను పరిశీలించారు. పెడింగ్ కేసుల వివరాను అడిగి తెలుసుకున్నారు సంస్థకు మంచిపేరు తీసుకురావాలని, ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు. పొలాల్లో రైతుల ట్రాన్స్ ఫారంలు చోరీ జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు కార్యక్రమంలో సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, హుస్సేన్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తీరువా చెల్లిస్తేనే పోటీకి అర్హులు


నీటి తీరువా రసీదులు సిద్ధం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చెన్నూరు, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారిని బలపరచే వ్యక్తులు కచ్చితంగా సాగు భూమికి నీటి తీరువాను చెల్లిస్తేనే పోటీకి అర్హులని తహసీల్దార్ సరస్వతి తెలిపారు. చెన్నూరులో బుధవారం ఆమె మాట్లాడుతూ నీటి తీరువాను వీఆర్వోల ద్వారా ఈనెల 12 తేదీలోగా చెల్లించాలన్నారు. 1431వ పసలీ నుంచి 1434వ పసలీ వరకూ చెల్లించాలన్నారు. ఫలీ చెల్లించినప్పుడు వారికి ఇచ్చే రసీదులను నామినేషన్ సమయంలో చూపించాలన్నారు. కాగా అధికారులు వాటిని పరిశీలించిన తర్వాతే నామినేషన్ వేయిస్తారన్నారు. ఒకవేళ ఫసలీ చెల్లించకుండా నామినేషన్ వేస్తే అది చెల్లదన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో సర్వే డీటీ అర్చన, వీఆర్వోలు వినోద్, లక్ష్మీ, వెంకటసుబ్బయ్య, శివ, సాధిక్, రసూల్, వేణు, తదితరులు ఏ ఏ రెవెన్యూ గ్రామాల్లో ఏ మేరకు నీటి తీరువా బాకీ వున్నారో రికార్డులను తీసి గ్రామ వీఆర్ఏల ద్వారా రైతులకు చెప్పి పంపడం జరిగింది.

'ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి'

లింగాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల అధికారి ధర్మేంద్రకుమార్ తెలిపారు. పెద్దకుడాల పోలింగ్ కేంద్రంలో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నీటిసంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈనెల 14వ తేదీ నామినేషన్ కార్యక్రమం, ఎన్నికల నిర్వహణ ఫలితాల ప్రకటన అంతా ఒకేరోజు ఉంటటుందని తెలిపారు. కామసముద్రం చెరువు, రామాపురం, కొత్తపల్లె, నక్కలపల్లె, దొండ్లవాగు, 1,2 డిస్ట్రిబ్యూటర్ల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

152 బస్తాల బియ్యం స్వాధీనం

కడప(క్రైం)/చెన్నూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కడప రీజనల్ అధికారి శ్రీనివాసుల రావు ఆధ్వర్యంలో 152 బస్తాలు (7504 కిలోలు) బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. చెన్నూరు వనం వీధి వాసులు కాటం నిరంజన్, కాటం బ్రహ్మయ్య గ్రామాలకు వెళ్లి పీడీఎస్ బియ్యం సేకరించి వాటిని బస్తాలోకి మార్చి గోపవరం రోడ్డులోని రేకుల షెడ్డులో నిల్వ ఉంచినట్లు విజిలెన్స్ అధికారి శ్రీనివాసుల రావు తెలిపారు. నిల్వ ఉంచిన బియ్యంను ఇతర ప్రాంతాలకు తరలిస్తునట్లు సమాచారం రావడంతో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. వీరిపై చెన్నూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

కడప(క్రైం)డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కడప రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం3లో నడుస్తూ వెళుతున్న గుర్తు తెలియని వృద్ధురాలిని రైలు ఢీ కొనడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపారు. మృతురాలికి 60 ఏళ్లు ఉంటాయని మెడలో డిస్కో దండ ధరించినట్లు తెలిపారు. తలకు గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వివరాలకు 9440900811 ఫోన్ చేసి తెలుసుకోవచ్చని, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి సూచించారు. బుధవారం అంకిరెడ్డిపల్లె, కొమ్మద్ది గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఏఓ శ్యామ్‌బాబుతో కలిసి ఏడీఏ మాట్లాడుతూ శనగలో వేరుకుళ్లు, మొదలుకుళ్లు ఆశించిన పొలాల్లో మొక్కల సాంద్రత తగ్గిపోతుందన్నారు. అధిక వర్షాలు, అధిక తేమ పొలాల్లో నీరు నిల్వ ఉండడం వలన మొక్కల వేరుకుళ్లి పోతుందన్నారు. మంచుతో కూడిన వాతావరణం ఉండడంతో మినుము, నువ్వులకు బూడిద తెగులు ఆశిస్తుందన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన : వైసీపీ

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా వైసీపీ పోరాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిరసన కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేసిన వారు మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలంతా తిరిగబడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. 13న జరిగే నిరసన కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైసీపీ నేతలు సునీల్‌కుమార్, రఫి పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలి

● మూడో రోజుకు చేరిన న్యాయవాదుల రిలేదీక్షలు


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప

కడప రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు, సీనియర్ న్యాయవాదులు సంపత్‌కుమార్, రవి చక్రవర్తి డిమాండ్ చేశారు. ఈగిల్(ఫాస్ట్ ట్రాక్ కోర్టు)ను తిరుపతిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన రిలేదీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కడప నగరం రాయలసీమ జిల్లాలకు నడిబొడ్డున ఉందని కాబట్టి కడపలో ప్రత్యేక ఫాస్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేకపోగా కడపలో చేపడుతున్న గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించడం దారుణమన్నారు. ఈ చర్యలతో కక్షిదారులు ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ కేసులను కడపలోనే విచారించాలని, తిరుపతిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు తీసుకొచ్చిన జీఓ నెంబర్ 145ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను నెరవేర్చేవరకు కోర్టు విధులను బహిష్కరిస్తూ, రిలేదీక్షలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పలు రూపాల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో అలీఖాన్, రామకొండయ్య భువన ఏకాదశరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సంపత్‌కుమార్, మంజునాథ, చిన్నయ్య పాల్గొన్నారు. ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, మాజీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు రవి చక్రవర్తి, అరుణకుమారి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



నష్టపరిహారం నగదు అందించండి

కొర్రపాడు రోడ్డు విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణలో బాధితులు

ప్రొద్దుటూరు,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని కొర్రపాడు రోడ్డును రాజీవ్ సర్కిల్ నుంయి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు విస్తరణ పనులు చేపడితే స్థలాలు కోల్పోయే వారికి నష్టపరిహారంగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్ బాండ్లు) ఇస్తే అంగీకరించబోమని నగదు నష్టపరిహారం ఇస్తేనే విస్తరణకు ఒప్పుకుంటామని కొర్రపాడు రోడ్డు విస్తరణ బాధితులు తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగరాజు కొర్రపాడు రోడ్డు విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వల్లంకొండు మనోహర్ అనే వ్యాపారి మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డుకంటే పట్టణంలో మెయిన్ బజార్, దర్గా బజార్, గంగమ్మదేవళం వీధి, గాంధీరోడ్డు లాంటి ప్రధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను విస్తరించాలన్నారు. కొర్రపాడు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

రోడ్డును 100 అడుగుల మేర విస్తరించినా అభ్యంతరం లేదని కానీ స్థలాలు, ఇళ్ళు కోల్పోయే వారికి నష్టపరిహారం కింద టీడీఆర్ బాండ్ల ఇస్తామంటే అంగీకరించేది లేదన్నారు. మార్కెట్ ప్రకారం నష్టపరిహారం నగదు అందిస్తేనే ఒప్పు కుంటామని తెలియజేశారు. మరికొందరు 80 అడుగులు మాత్రమే కుదిస్తే సరిపోతుందని 100 అడుగుల వల్ల మా ఇళ్ళులే పూర్తిగా నష్టపోతామన్నారు.రాజీవ్ సర్కిల్ నుంచి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు ఎడమవైపున స్థలాలతో సహా కట్టడాలు 50 వుండగా కుడివైపు 60 వరకు బాధితులు వుంటారని ఏసీపీ నాగరాజు తెలిపారు. కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డు విస్తరణ పదేళ్లుగా నలుగుతున్న విషయం అందరికీ తెలుసని టీడీఆర్ బాండ్ల పై ఎవ్వరూ అపోహలు పడనవసరం లేదన్నారు. నష్ట పరిహారం విషయంలో ఒక అంగీకారానికి వచ్చాకే విస్తరణ పనులు చేపడతామన్నారు. ఇందులో రోడ్డు విస్తరణతో పాటు కాలువ నిర్మాణం, పైపులైను, సెంట్రల్ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసి విలువ పెంచుతామన్నారు. సమావేశంలో వంద మందికి పైగా రోడ్డు విస్తరణలో స్థలాలు ఇళ్ళు కోల్పోయే వారు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కొండాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్‌ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బద్వేలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్మికులు , ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ కమిటి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, సీఐటీయూ నాయకులు రాజగోపాల్, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి భూమిపూజ

ఎర్రగుంట్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రైల్వే అధికారులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ప్లాట్‌ఫారంపై ఉన్న అడ్డంకులు అన్ని తొలగించుకుని నిర్మాణం మూడు నెలల్లో పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం 1వ ప్లాట్‌ఫారంపైకి ల్యాండ్ అయివున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి సమాంతరంగా ప్రహరీ అవతల ప్రొద్దుటూరు రోడ్డువైపు లాండ్ అయ్యేవిధంగా దీన్ని నిర్మించనున్నారు. రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీ పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో ప్రచురించబడిన పుస్తకాలకు కథ, పురస్కారం, వచన కవితా పురస్కారం, బాలసాహిత్య పురస్కారాలను ప్రదానం చేస్తామని, ఆసక్తి ఉన్న రచయితలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన రచయితలకు రూ.6 వేలు, నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరిస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితలు, కవులు పురస్కారాలకోసం తమ పుస్తకాలను ఈనెల 30వ తేదీ లోపు పంపాలని తెలిపారు. వివరాలకు 9440703716, 9849354729 నంబరును సంప్రదించాలని కోరారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

ఎర్రగుంట్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలో నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. చిన్నదండ్లూరు, ఇల్లూరు, హనుమనగుత్తి, పోట్లదుర్తి గ్రామాలకు చెందిన నాలుగు సంఘాలకు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. డిసెంబరు 14వ తేదీ ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఓటింగ్ అనంతరం ఎన్నికైన టీసీలను ప్రకటిస్తారు. అనంతరం వారిచే మధ్యాహ్నం మూడు గంటలకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఆయకట్టు కింద భూములున్న సుమారు 4895 మంది రైతులు ఇందులో ఓటు హక్కును కలిగివున్నారు.కాగా నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులందరికీ దిశానిర్దేశం చేసినట్లు తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ


పూజ చేస్తున్న దృశ్యం

బద్వేలుటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ, కుంభాభిషేకం వైభవంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరురోడ్డు, నాగుల చెరువుకట్ట సమీపంలో సుమారు రూ.2కోట్ల వ్యయంతో అయ్యప్పస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు రాగిమాను ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. వేకువజాము నుంచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'బకాయిల చెల్లింపులో జాప్యం తగదు'

జమ్మలమడుగు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న జాప్యం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా విమర్శించారు. బుధవారం జమ్మలమడుగులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాదనవిజయకుమార్, పాలెం మహేష్‌బాబు,యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షురాలు డి.సుజాతారాణి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, సురేష్‌కుమార్‌పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కాశినాయన డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):ఏపీ మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం,కాశినాయన ఎస్టీయూ మండల బాధ్యుడు ఎం.రవీంద్రబాబు పేర్కొన్నారు.బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈకార్యక్రంలో రీజియన్ కన్వీనర్ క్రిష్ణారెడ్డి,వాకా చంద్రశేఖర్,వీవీ నారాయణ,జి.రమణయ్య పాల్గొన్నారు.

రెండు స్కూటర్లు ఢీ : ఇద్దరికి గాయాలు

జమ్మలమడుగు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో పెన్నానది వంతెన వద్ద బుధవారం రాత్రి రెండు స్కూటర్లు ఢీ కొని ఇద్దరికి గాయాలయ్యాయి. కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మద్దిలేటి చాగలమర్రి నుంచి జమ్మలమడుగు మీదుగా కొండాపురానికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. పట్టణంలోని వంతెన వద్దకు రాగానే ఎదురుగా మోరగుడి గ్రామానికి చెందిన ఓబయ్య వేగంగా వచ్చి కానిస్టేబుల్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాలో ఉక్కుపరిశ్రమను నిర్మించాలి

బద్వేలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కుపరిశ్రమను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ బుధవారం స్థానిక ఎస్‌వీసీఎం పాలిటెక్నిక్ కళాశాల వద్ద ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ర్యాలీ, నిరసన

జమ్మలమడుగు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌రేట్ ఎదురుగా ఈనెల 13వ తేదీ రైతులతో ర్యాలీ, నిరసన కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో రైతులతో అన్నదాతకు అండగా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రైతులతో ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు రైతులతో కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శివగురివిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ గజ్జెల లక్షుమయ్య, వడ్డిరాల అంజనేయులు, దన్నవాడ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, దళిత నాయకులు బోనం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట బీమా చేయించుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పరపల్లెలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కాగా ఉప్పరపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు హరీంద్ర, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సుస్థిరపాలన, అభివృద్ధిపై శిక్షణ

ఖాజీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఎంపీడీవో దివిజసంపతి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సుస్థిరపాలన, అభివృద్ధి అంశాలపై గురు, శుక్రవారం రెండురోజుల్లో శిక్షణ తరగతులు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వెటర్నరీఅసిస్టెంట్లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

ప్రొద్దుటూరు రూరల్..: ప్రొద్దుటూరు మండల పరిధిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండు రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం, శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ భవనం, స్త్రీశక్తి భవనంలలో రెండు బ్యాచ్‌లుగా ఈ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్షయవ్యాధి రహిత దేశంగా నిర్మిద్దాం

బద్వేలు, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత దేశంగా నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డబ్ల్యూహెచ్‌వో కన్సులేట్ డాక్టర్ ప్రశాంత్ పేర్కొన్నారు. బుధవారం తొట్టిగారిపల్లె ఆరోగ్యకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. క్షయ అనుమానిత పరీక్ష రేటును పెంచాలని, క్షయరోగులు మందులు సక్రమంగా వాడి వ్యాధి తీవ్రతను తగ్గేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవిబాబు,డాక్టర్ జె.వినయ్,భారతి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై పటిష్ట చర్యలు చేపట్టండి

బద్వేలు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులు విశ్వనాద్ పేర్కొన్నారు. బుధవారం బద్వేలు పురపాలక కార్యాలయంలో ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డు రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

ప్రొద్దుటూరు,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె గ్రామంలోని రిటైర్డు రైల్వే ఉద్యోగి గోపాల్ ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ నెల 6న కడపలో తమ బంధువుల ఇంటికి వెళ్లిన గోపాల్, కుటుంబసభ్యులు తిరిగి ఇంటికి వచ్చి తలుపు తెరిచి చూడగా ఇంట్లో బీరువా తెరచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. అందులోని 7 తులాల బంగారం, 500గ్రాములువెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

14, 15 తేదీల్లో క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఈనెల 14, 15 తేదీల్లో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.జయరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామని, 14వ తేదీ ఉదయం 8 గంటలకు విద్యార్థులు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.



PUBLIC NOTICE

Under the instruction of my client M/s Shriram Finance Ltd., Porumamilla, I issue this public notice as follows : **Shaik Ameer Basha** S/o **Khadar Valli,** Uddikatta Street, Porumamilla Town, Kadapa District has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any right possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt, Badvel Sub-District, Gopavaram mandal, Gopavaram Village fields Sy.Nos (1) 124-2, Sub-Division No. 124-2C2, (2) Sy.No. 125- Sub-Divided Sy.No. 125-2 - within the Sy.Nos. site - 333.33 Sq. yards - located in old ward No. 1, interior residential area, name venture S.K. Happy Homes - demarcated as Plot No. 48, **Boundaries :** East - Joint right of ingress and egress in the rastha in the width of 33 feet West - Site - Plot No. 27, North - Joint right of ingress and egress in the rastha in the width of 33 feet, South - Site - Plot No. 47 **Measurements :** East - West : 50 ft. or 15.24 mtrs., North-South - 60 ft or 18.29 mtrs.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

Under the instruction of my client M/s Shriram Finance Ltd., Porumamilla, I issue this public notice as follows : **Gurrampati Vijaya Bhaskar Reddy** S/o **Tirupal Reddy,** r/o 1-2-116, Valleravaripalle, Badvel Mdl Kadapa District has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any right possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt, Badvel Sub-Dt, Gopavaram Mdl, Gopavaram Village fields site of 133.33 Sq. yards in the Sy.Nos 124-2-Sub-Division No.124-2C2, Sy.No.125-Sub Divided as Sy.No. 125-2 located in old ward No. 10, inter residential area, name venture S.K. Happy Homes - demarcated as Plot No. 157 **Boundaries :** East - Site - Plot No. 160 West - Site - Joint right of ingress and egress in the rastha in the width of 33 feet, North - Site - Plot No. 156, South - Site - Plot No. 158 **Measurements :** East - West: 40ft. or 12.19mtrs., North-South-30 ft or 9.14 mtrs. -Totalling to 133.33 Sq.yards- Site with all easement rights.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

Under the instruction of my client M/s Shriram Finance Ltd., Porumamilla, I issue this public notice as follows : **Shaik Ambavaram Noorjahan** W/o **Jamala Basha,** r/o 5/87, Narasapuram Village, S.A.K.N. Mandal Kadapa District has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any right possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt, Badvel Sub-District, Porumamilla mandal, Rangasamudram Village fields Sy.No. 87, Ac. 0.03 cents and 6 Sq. links or 174.44 Sq. yards, out of Ac. 0.70 cents out of Ac. 1.39 cents - located near door no. 4/54 of Kammavaripalli at - demarked as Plot No. 14 **Boundaries :** East - Site - Plot No. 27 West - 18 feet width rastha, North - Site - Plot No. 15, South - Site - Plot No. 13 **Measurements :** East - West : 50 ft. or 15.22 mtrs., North-South - 31.4 ft or 9.56 mtrs. - Totalling to 174.44 Sq. Yards - into this site the ingress and egress right through the 20 feet width rastha relating to Kalavakuri Pedda Gurrappagari Chen. Krishnamma W/o Chinna Venkata Subbaiah and Kalavakuri Saraswathi

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.



ప్రతి భూసమస్యకూ పరిష్కారం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో ప్రతి సమస్యకూ పరిష్కారం చూపేందుకే అధికారులు ప్రజల వద్దకు వచ్చారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కాకిరేణిపల్లె, చౌడూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య, రూరల్ ఎస్‌ఐ రఫి పాల్గొన్నారు.

కొండాపురం..: రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం దొరుకుతుందని జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలంసాయిశ్రీ తెలిపారు.బురుజుపల్లె గ్రామంలోబుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు.

ముద్దనూరు..: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ పేర్కొన్నారు.మండల పరిధి వేల్పుచర్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిథిగా ఆర్డీవో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీకోడూరు..: భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితీశ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మూన్నెల్లి గ్రామ రెవెన్యూ సదస్సు ఐ త్రం పేట సచివాలయంలో తహసీల్దార్ మధునాయక్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం కబ్జాకు గురైన కుంటను పరిశీలించి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కుతెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు రామ చం ద్రారెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, దుగ్గిరెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, బీకోడూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, బద్వేలు టీడీపీ నాయకుడు రితీశ్‌కుమార్‌రెడ్డి

